

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,27 ఏప్రిల్ 2025 8


## ఫిషింగ్ హార్బర్లను

# త్వరితగతిన పూర్తి చేయాలి

**కాకినాడ యాంకరేజ్ పోర్టును సందర్శించిన రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**





**కాకినాడ,మేజర్‌న్యూస్:**రాష్ట్రంలోని సువిశాలమైన తీరప్రాంతం,సహజవనరులను సమర్ధవంతంగా వినయోగించుకునే విధంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను త్వరిత గతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రరోడ్లు మరియు భవనాలు ,పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖమంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ జిల్లాపర్యటనలో భాగంగా ఆయన శనివారం యాంకరేజ్ పోర్టును అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం యాంకరేజ్ పోర్టు నుంచి బార్జిలోకి లోడింగ్ ప్రక్రియను మారిటైమ్ బోర్డు, పోర్టు అధికారులతో కలిసి పరిశీలించచారు.అనంతరంకాకినాడ సీపోర్టును పరిశీలించారు.మంత్రి మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాకినాడలో పోర్టులు,ఫిషింగ్ హర్బర్ అభివృద్ధి పనులను పర్యవేక్షిం చేందుకు రావడం జరిగిందన్నారు. కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ 2018లో ఎంవోయూ చేసుకోవడంజరిగిందని ఈప్రాజెక్టు ద్వారా 3బెర్తల నిర్మాణం కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. వీటిలో ఒకబెర్త్‌ను బొగ్గు కొరకు,మిగిలిన 2బెర్తలద్వారా ఇతర అవసరాలుతీర్చుకోవడంకోసం ఉపయో గించుకుంటున్న మని ఆయన తెలిపారు.2022లోఈప్రాజెక్టు ప్రారంభంకాగా, ఇప్పటి వరకు 16 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతులు చేస్తున్నారు..2026 లక్ష్యంగా పెట్టుకుని ఈ పోర్టు అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని వారిని ఆదేశించడం జరిగిందని మంత్రి తెలిపారు.ఈపోర్టులో అరబిందో ఇన్‌ఫ్రా 74శాతం మరియు **26శాతం జీఎంఆర్ వాటాఉందని..** దీనిలో ప్రభుత్వం రెవెన్యూ షేర్‌వాటా2.7శాతం తీసుకోవడం జరుగుతోంది. 31 నుంచి 40 సంవత్సరాలకు 5.4రెవెన్యూ వాటానూ, 40నుంచి 50 సంవత్సరాల వరకు 10.80 శాతం రెవెన్యూ షేర్

- తరువాయి 2లో..



# అర్జీల సత్వర పరిష్కార దిశగా చర్యలు..

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కారవిధానంలోరాష్ట్రముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, మంత్రులు,రాష్ట్రస్థాయి అధికారులు ద్వారా సిఫార్సు చేసిన అర్జీలను సత్వరపరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా జిల్లా,డివిజన్ మండలస్థాయి అధికారులు వద్ద పెండింగ్‌కేసులనుప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, తూర్పుగోదావరిజిల్లాపరిధిలో మొత్తంరాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, తదితరులు నుంచి మొత్తం 91 అర్జీలు సిఫార్సు చేసినట్లు, వాటిలో ఇంకా 57 కేసుల పరిష్కార స్థాయి పెండింగ్ విషయమై అధికారులు నుంచి వివరణ కోరడం జరిగిందన్నారు.

- తరువాయి 2లో..

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను

# కలిసిన గౌరీ నాయుడు ..

**- అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** పంచాయతీరాజ్ మరియు గ్రామీణఅభివృద్ధి, పర్యావరణం అటవీ,సైన్స్&టెక్నాలజీ శాఖల మంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే,ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని పిఠాపురం పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త, రాచకొండనరసింహశర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్,సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ లీడర్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు కాకినాడ జిల్లాపిఠాపురం పట్టణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై పవన్‌కల్యాణ్‌తోచర్చించారు.

డిగ్రీ కళాశాలలో విద్య బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రతకల్పించాలని గౌరీనాయుడు పవన్ కల్యాణ్‌ని కోరారు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలువిషయంలో అతిథి అధ్యాపకులు చాలా తక్కువస్థాయిలో వేతనాలు పొందుతున్నారని తెలిపారు.గంటలు చొప్పున కాకుండా నెలవారిగా ప్రభుత్వం కన్సాలిడేటెడ్ జీతం ఇచ్చే విధంగా, రెగ్యులర్ అధ్యాపకుల బదిలీలు జరిగినప్పుడు పోస్ట్ ఖాళీగా ఉన్న డిగ్రీకళాశాలకు అతిథి అధ్యాపకులను బదిలీ చేసేలా కూటమి ప్రభుత్వం తరఫున సహకారాన్ని అందించాలని తెలియజేస్తూ గౌరి నాయుడు వినతిపత్రం అందజేశారు.

- తరువాయి 2లో..

## అర్హులకు నేరుగా ఖాతాలకే

# వేట నిషేదకాల భృతి జమ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** మత్స్యకార సేవలో కార్యక్రమం ద్వారా జిల్లాలో 24,769 మంది అర్హులైన లబ్దిదారుల ఖాతాలకు ఒక్కొక్కరికీ 20 వేల రూపాయల వంతున 49.54 కోట్ల సముద్ర వేట నిషేదకాల భృతిని నేరుగా వారి ఖాతాలకే జమ చేయడం జరిగిందని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు.శనివారం మద్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి జూన్ 14 వరకూ రెండు నెలల సముద్ర వేట నిషేధకాలానికి మత్సకారులకు రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్న జీవన భృతి పంపిణీ కార్యక్రమాన్ని నిర్విహించారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరై 24,769 మంది లబ్దిదారులకు 49,43,80,000 రూపాయల మొత్తాన్ని పంపిణీ చేస్తూ మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఇన్జార్జి కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ బంగాళాఖాతంలో వివిధ రకాల చేపల జాతులు ఏప్రియల్ నుండి జూన్ వరకు గల కాలంలో గుడ్లు, పిల్లలను పెట్టి సంతతివృద్ధి చేసుకునే బ్రీడింగ్ కాలమని, అందుకే ఏటా ఏప్రియల్-15

- తరువాయి 2లో..

# గోవింద నామ స్మరణతో మార్మోగిన వెంకన్న ఆలయం







**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా, కోరిన కోర్కెలు తీర్చేదైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యావచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీప్రత్యేకబస్సులు నడిపింది. శనివారం స్వామి వారి ఆదాయం రూ.50 లక్షలు సమకూరింది. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్వామివారిని జడ్పీ సీఈవో వి.లక్ష్మణరావు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, ఎంపీడీవో వెంకట్ రామన్ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఫిషింగ్ హార్బర్లను త్వరితగతిన పూర్తి చేయాలి

మొదటిపేజి తరువాయి

ప్రభుత్వానికి వస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.2,621 కోట్లు.. ఇప్పటికే 28 శాతం పనులు పూర్తి చేశారు.. మిగిలిన పనులు జూన్ 2026 పూర్తి చేయాలని ఒప్పందంలో ఉందన్నారు. భూసేకరణ వంటి కొన్ని సమస్యలు ఉన్నాయి.. వీటిని ఆర్డీవో, మారిటైమ్ బోర్డు సీఈవోలు త్వరితగతిన పరిష్కరించే ప్రయత్నం చేయాలని ఆదేశాలుజారీచేయడంజరిగిందన్నారు.తద్వారా ఈప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని మంత్రి తెలియజేశారు.

**కాకినాడ యాంకరేజ్ పోర్టు :** కాకినాడ యాంకరేజ్ పోర్టుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నాం.. హ్యాండ్లింగ్ సామర్థ్యం 4.ఎంఎంటిగా ఉందన్నారు.. గత ఏడాది 3.88 ఎంఎంటి బియ్యం ఎగుమతులు చేయడం జరిగింది. 2023-24 ఆర్థికసంవత్సరానికి ఈపోర్టుద్వారా రూ.61 కోట్లు ఆదాయం వస్తే, నేడు మరో రూ.7 కోట్లు పెరిగి..ఈ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 68 కోట్లు ఆదాయం ఆర్జించడం జరిగిందని మంత్రి తెలిపారు. 1993లో రూ.2 ఓ93కోట్లతో కాకినాడ డీప్‌వాటర్‌పోర్టు ప్రారంభించడం జరిగింది .ఇందులో 3బెర్త్ లున్నాయి.. 1998లో ఈ పోర్టు ఆఫరేషన్‌లోకి వచ్చింది.ఈ పోర్టు హ్యాండ్లిగ్‌సామర్థ్యం 26 ఎంఎంటి.. ఇందులో 11 బెర్త్‌లు ఉన్నాయి..దీనిలో ప్రభుత్వంవాటా22%గా తీసుకోవడం జరుగు తోంది. ఈపోర్టు ద్వారా ఎరువులు, ఆయిల్,షుగర్ వంటి ఎగుమతులు జరుగుతున్నాయి..**ఉప్పాడ ఫిషింగ్ హార్బర్..**గతంలో 2018లో టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబునాయుడు ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌ను రూ.361 కోట్లతో ప్రారంభించడం జరిగింది.. గత 5 ఏళ్ల కాలంలో ఈ హార్బర్ నిర్మాణంలో అనేక సమస్యలు సృష్టించి, వైసీపీ ప్రభుత్వానికి సంబంధించిన కాంట్రాక్టర్ పనులు సకాలంలో పూర్తి చేయకపోతే, నేడు వ్యక్తిగతంగా సబ్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ముందుకు తీసుకెళు తున్నాం.. గత ప్రభుత్వం నుంచి పనులు చేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు ఇప్పటికీ పనుల్లో అలసత్వం వహిస్తున్నారని.. ఆయా పనులకు సంబంధించి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 5 నెలల కాలంలో పూర్తి చేసి, బెర్త్ లను మత్స్యకారులకు అంకితం చేయనున్నాం.. ఈ హార్బర్ కు సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి.. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా స్థానికంగా మత్స్యకారుల సమస్యలను నా దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఫిషింగ్ బోర్డ్ ప్యాకేజింగ్ లో సమస్యలు తలెత్తి ప్రమాదాలు జరగకుండా భవిష్యత్తులో తగిన జాగ్రత్తలు తీసుకుని వాటిని పరిష్కరిస్తామన్నారు.. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతిని రూ.20 వేలకు పెంచడం జరిగిందన్నారు.. త్వరలో మొత్తంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ లకు సంబంధించిన పెండింగ్ పనులు, భూసేకరణ పూర్తి చేసి త్వరితగతిన నిర్మాణం చేపడతామన్నారు..అలాగే మా ఆర్ బీ శాఖకు సంబంధించి.. పోర్టులతో రైల్వే, నేషనల్ హైవే ప్రాజెక్టుల అనుసంధానంకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి.. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలోని రహదారులను గుంతల రహితంగా తీర్చిదిద్దాం..

గత 5 ఏళ్లుగా ఆర్ & బీ శాఖలో వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల వల్ల దాదాపు 22 వేల కి.మీ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ముఖ్యమంత్రి సూచనల మేరకు రూ.1061 కోట్లతో గుంతల రహితంగా రాష్ట్రంలో రహదారులను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు మెరుగ్గా పనిచేయడంతో నేడు రోడ్లపై ప్రజలు సంతోషంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. మిగిలిన రోడ్లకు సంబంధించి పీపీపీ మోడల్ కింద అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీ కేటగిరీ కింద రోడ్లను అభివృద్ధి చేయడానికి మరో రూ.1000 కోట్లు కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.. త్వరలో ఆయా జిల్లాల్లో ఆర్‌అండ్‌బీశాఖ పెండింగ్ రహదారులను పూర్తిచేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కర్రిపద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్, మారిటైమ్ బోర్డ్ సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఫోర్డ్ అధికారి ధర్మశాస్త్ర ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో రోహింగ్యాలు?

రావులపాలెం, మేజర్ న్యూస్ : కాశ్మీర్‌లో పెహల్గాం పర్యాటక ప్రదేశంలో ఉగ్రవాదులు విచక్షణరహితంగా పర్యాటకులపై జరిపిన కాల్పుల్లో 28 మంది మరణించిన సంగతి విదితమే. దీంతో ఒక్కసారిగా దేశంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించేసరికి ప్రభుత్వాలు కూడా పాకిస్తాన్ పట్ల కఠిన చర్యలు చేపట్టి భారతదేశంలో ఉన్న పాకిస్తానీయులును, బంగ్లాదేశీయులను హైకమిషనర్ ఇప్పటికే వెనక్కి వెళ్లాలని పిలుపునివ్వడంతో పాటు ఆ దిశగా చర్యలు చేపట్టడంతో ఇప్పటివరకు పట్టణాల్లో ఉన్నటువంటి పాకిస్తానీలు, బంగ్లాదేశీయులు పల్లెలకు చేరుకుంటున్నారని తెలుస్తుంది. పట్టణాల్లో పోలీసులు ఇప్పటికే జల్లెడ పట్టి వారిని గుర్తించి వెనక్కి పంపించే దిశగా చర్యలు చేపట్టడంతో అక్కడ నుంచి చిన్న చిన్న పట్టణాలకు చేరుకుంటున్నారని వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇదే విధంగా రావులపాలెంలో శనివారం సాయంత్రం నుండి వచ్చిరాని తెలుగు భాషతోపాటు హిందీ ఉర్దూ అనర్గళంగా మాట్లాడే వ్యక్తులు తమకు పని కావాలి మీకు దగ్గర కాళీ ఉందా అంటూ హొటల్స్‌లో, వస్త్ర దుకాణాలతోపాటు డైరీ ఫామ్, వివిధ దుకాణాల దగ్గర వచ్చి పని ఉంటే చెప్పండని రీతిలో అడుగుతుండటంతో వారికి రకరకాల అనుమానాలు రేకిత్తి పని కల్పించేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం ఆనోటా ఈనోటా వ్యాప్తింప చేయడంతో దుకాణదారులు ముందుగానే జాగ్రత్తపడ్డారు. ఇప్పటికే ఇతర ప్రాంతాలలోనూ చాలాచోట్ల కొత్తవారు చాలాకాలంగా కనిపిస్తుండటం, చాలామంది బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లో ఉంటున్నారన్న వార్తలతో స్థానికులు వారి విషయంలో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్,ప్రభుత్వ అధికారులు అటువంటివారిని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అర్జీల సత్వర పరిష్కార దిశగా చర్యలు..

మొదటిపేజి తరువాయి

రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా 27, డిప్యూటీ సీఎం ద్వారా 22,ఇతరుల ద్వారా 42పరిష్కారం కోసం వొచ్చినట్లు, వాటికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి పరిష్కారం చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏ ఒక్క దరఖాస్తు సరైన కారణాలు లేకుండా పరిష్కారం అయినట్లు ఎండార్స్ మెంట్ చెయ్యరదన్నారు. ఇందులో భాగంగానే ఆయా ఫైల్స్ తీసుకుని సంబంధిత అర్జీలను జిల్లా కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించి, తగిన సూచనలను చెయ్యడం జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఆర్డీవో రాణిసుస్మిత,ఆర్‌కృష్ణ నాయక్, మండలాల తహసిల్దార్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసిన గౌరీ నాయుడు ..

మొదటిపేజి తరువాయి

గత సంవత్సరం ఉగాది సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో కలిసినప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గౌరీ నాయుడు గుర్తు చేశారు. విద్యార్థులబంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానని, విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చినట్లు గౌరీ నాయుడు తెలిపారు. కోనసీమ జిల్లా రచయితల సంఘం ద్వారా యువ సాహితీ పురస్కారం అందుకున్న గౌరీ నాయుడునీ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో గౌరీ నాయుడు మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పిఠాపురం జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ, పవన్ కళ్యాణ్ పొలిటికల్ సెక్రటరీ పిడుగు హరిప్రసాద్, పిఠాపురం తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పాడా డైరెక్టర్ చైత్ర వర్షిణి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పిఠాపురం టౌన్ జనసేన నాయకులు చెల్లుబోయిన సతీష్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు నేరుగా ఖాతాలకే వేట నిషేదకాల భృతి జమ

మొదటిపేజి తరువాయి

నుండి జూన్-14 వరకూ రెండు నెలల పాటు ప్రభుత్వం సముద్ర చేపల వేట నిషేదాన్ని అమలు చేస్తోందన్నారు. వేట నిషేధాన్ని సక్రమంగా అమలు చేయడం ద్వారా సముద్ర మత్స్య సంపద పెంపొంది మత్స్యకారులకు మిలిగిన సంవత్సరమంతా మంచి జీవ నోపాధి లభిస్తుందన్నారు. ఈ మొత్తాలు నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమ అవుతాయని ఆయన తెలిపారు. మత్స్య సంపద వృద్ధి, తద్వారా మెరుగైన జీవనోపాధులను కల్పించే సముద్ర చేపల వేట నిషేధాన్ని మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వ రావు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఇచ్చిన మాటప్రకారం మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమద్రవేట నిషేద కాలానికి ఇచ్చే జీవనభృతిని 10 వేలు నుండి 20 వేల రూపా యలకు పెంచి అందిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి మత్స్యకారులందరి తరపున ధన్యవాదాలు తెలియ జేశారు. రాష్ట్రంలో 1,29,185 మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార సేవలో పథకం ద్వారా 258 కోట్లు మొత్తాన్ని పంపిణీ చేస్తోందని, ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో 24,769 మంది లబ్దిదారులకు 49.44 కోట్లు అందిస్తోందన్నారు. విద్యుత్ యూనిట్ల వినియోగం, నాలుగు చక్రాల వాహనం ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్ల జిల్లాలో 991 మందికి సముద్ర వేట మత్స్యకారులతో పాటు, ఇన్ లాండ్ మత్స్యకారుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం పెద్దపీట పేస్తోందని, మత్స్యకారులకు దక్కకుండా చేపల చెరువులు వేలం వేసేందుకు గత ప్రభుత్వం జారీ చేసిన 217 జీవోను రద్దు చేసిందని తెలిపారు. మత్స్యకారులకు ఏమి కావాలో తెలుసుకుని అవి అందిస్తోందని, కష్టకాలంలో అండగా నిలు స్తోందని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ మత్స్యకారుల విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రతలు పట్టించుకుంటున్న కూటమి ప్రభుత్వానికి మత్స్యకారులు వెన్నంటి ఉండాలని కోరారు.కార్యక్ర మంలో జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బలసాడి రంగారావు, మత్స్యకార సంఘాల నేతలు మాట్లాడుతూ జీవనభృతిని రేషన్ కార్డు ఆధారంగా పరిగణించడం వల్ల కార్డులు లేని అర్హులకు అందడం లేదని, ఆధార్ కార్డును పరిగణలోకి తీసుకుని మంజూరు చేయాలని కోరారు.సబ్సిడీపై ఇచ్చే డీజిల్ పరిమాణాన్ని 2 వేల లీటర్లకు పెంచాలని, తక్కువ ధరలో బయోడీజిల్ సరఫరా చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో అతిధులు, సభికులు శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి మత్స్యకార సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించి చేసిన ప్రసంగాన్ని లైవ్ ప్రసారం ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి వి.కృష్ణారావు, క్షేత్రాధికారులు, మత్స్యకార సొసైటీల నేతలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రొమటోగ్రఫీ పద్ధతులను ప్రయోగాత్మకంగా నేర్చుకోవాలి

**- ప్రొఫెసర్ వి.పీసపాటి**
**- ఘనంగా ముగిసిన క్రోమటోగ్రఫీ అంతర్జాతీయ సెమినార్ మరియు వర్కుషాప్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) రసాయన శాస్త్ర విభాగం మరియు యూకే కు చెందిన రాయల్ సొసైటీ అఫ్ కెమిస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో ఆధునిక క్రోమటోగ్రఫీ పద్ధతులపై పరిశోధకులకు, పీజీ విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సెమినార్ మరియు వర్కుషాప్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. పరిశోధకులకు మరియు విద్యార్థులకు ఫార్మసిటికల్ కంపెనీల లో క్రోమటోగ్రఫీ ఆవశ్యకత, మెళకువలు, థిన్ లేయర్ క్రోమటోగ్రఫీ ప్రిన్సిపుల్స్ మరియు అప్లికేషన్స్ ,కాలమ్ క్రోమటోగ్రఫీ వంటి అంశాలను సదస్సులో తెలియజేసి ప్రయోగశాలలో విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లా డుతూ పరిశోధనా వికాసానికి, భావ వినిమయానికి, నూతన ప్రయో గాలు నిర్వహించ డానికి ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకున్నప్పుడు మరిన్ని అంశాలను తెలుసు కుంటారని కార్యక్రమ కన్వీనర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ బి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాయల్ సొసైటీ అఫ్ కెమిస్ట్రీ (యూ. కే ) లోకల్ సెక్షన్ డెక్కన్ చైర్మన్ ప్రొఫెసర్ వి. పీసపాటి, యూ ఎస్ ఏ కి చెందిన సై జెన్ ఫార్మసిటికల్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, హైదరాబాద్ డైసెల్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ ఎం వి నరేంద్ర కుమార్ తళ్లూరి, శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎస్. రామకృష్ణ ఆదిత్య కళాశాలకెమిస్ట్రీ విభాగాధిపతి కే.సురేష్ కుమార్, అధ్యాపకులు కె.నాగు, వి.సోమేశ్వర రావు, కే.వీరబాబు, బి.దివ్య మరియు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కెమిస్ట్రీ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.

# నవోదయం 2.0 పై ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ సమీక్ష

**పెద్దాపురం,మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ నందు శనివారం కాకినాడ జిల్లా, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ రేణుక సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జగ్గంపేట, గండేపల్లి, పెద్దాపురం మండలంలో నాటుసారా నిర్మూలనకు గాను 43 క్రైమ్ ప్రోన్ గ్రామాలలో గ్రామ సభలు, అవగాహన సదస్సులు, కళాజాత మీటింగ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఏప్రిల్ నెలలో 46 కేసులు నమోదు చేసి 168 లీ.నాటుసారా స్వాధీనపరచుకుని 10,200 లీ.బెల్లపు ఊట ధ్వంసం చేసి, 39 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. అలాగే 49మందిని బైండోవర్ చేసి ఆరుగురి చేత 1,15,000/- బ్రీచ్ అమౌంటు కట్టించినట్లు సిఐ తెలిపారు. ఎవరైనా నాటుసారాయి మరియు అక్రమ మద్యం అమ్మినా, రవాణా చేసినా, ప్రొత్సహించినా వారిపై కేసులు నమోదు



చేయడం జరుగుతుందని సిఐ తెలిపారు.

# కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాద దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా నిరసన ర్యాలీ




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జమ్ము కాశ్మీర్ పహల్గామ్‌లో హిందూ పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ దేశవ్యాప్త నిరసన ర్యాలీలో భాగంగా శనివారం విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ భానుగుడి సెంటర్ నుండి మొదలై కోకిలా సెంటర్ మీదుగా మరల భానుగుడి చేరింది అని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్ అన్నారు. తొలుతగా ఉగ్రదాడికి బలి అయి అశువులు కొల్పోయిన కాశ్మీర్ సందర్శకులకు అశ్రునివాళులు అర్పించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చంద్రమౌళి మరియు మధుసూదన్ రావు లకు అశ్రు నివాలులర్పించారు. వారి ఆత్మశాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దేశంలో ఉగ్రవాదం నశించాలని, ఉగ్రవాదం ప్రోత్సహించే వాళ్ళకి తగురీతిన బుద్ధిచెప్పాలన్నారు. దేశ ప్రధాని తీసుకొంటున్న త్వరితగతి చర్యలను ప్రశంసించారు.

ఆధార్ కార్డులు అడిగి, బట్టలు ఇప్పి చూసి, మతప్రాతిపదికగా హిందూ మగవాళ్ళ మీద కాల్పులు జరిపి చంపడం అమానుషమని పట్నాయక్ అన్నారు. అవసరమైతే సామాన్య పౌరులు కూడా యుద్ధానికి సిద్ధపడాలని అన్నారు. ప్రాంత ధర్మాచార్య సంపర్క్ బిక్కిన రాజు మాట్లాడుతూ ఈ వికృతమైన చర్యను అందరూ ప్రతిఘటించాలని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నీ స్వాధీనం చేసుకోవాలని అన్నారు. మతోన్మాధం అధికమైన కొంతమంది ముస్లింలు ఉగ్రవాదులుగా మారి మారణకాండ సృష్టిస్తున్నారు అన్నారు. మోడీ తీసుకొంటున్న తక్షణ చర్యలను ముమ్మరం చేయాలన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి గోపరాజు కృష్ణమోహన్ మాట్లాడుతూ తన సంస్థ ఇటు వంటి హేయమైన ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. తదుపరి నిరసన ర్యాలీ కోకిలా సెంటర్ మీదుగా భానుగుడి చేరుకుంది. కార్యక్రమంలో జిల్లా కోశాద్యక్షులు గుండౌజు భానోజి రావు, జిల్లా దర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ డా. నమశ్శివాయ, భానుగుడి ప్రఖండ అద్యక్షులు రేద్నం రాజా, ఆర్ఎస్ఎస్ గోపరాజు సుబ్బారావు, రామారావుపేట ప్రఖండ్ గోరక్షా ప్రముఖ్ సుబ్రహ్మణ్యం, దిలీప్ కుమార్ సద నాని, వరదా శోభారాణి, ఎన్.శ్రీనివాసు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి గోపరాజు కృష్ణమోహన్, సేవికా సమితి సభ్యురాలు లిఖిత, వి.శ్రీనివాస్‌రాజు, వై.కృష్ణ, వేంకటరమణ, బాలాజి, సాయి గోపి, హిందూ బందువులు పాల్గొన్నారు.

# ఫిషింగ్ లైసెన్స్‌పై అవగాహన కార్యక్రమం



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** జిల్లా కలక్టర్ మరియు మెజిస్ట్రేట్ ఆదేశముల మేరకు స్విమర్స్ క్లబ్, పుష్కరాల రేవు వద్ద గోదావరి నదిలో చెక్క పడవలు (నావలు) మరియు తెప్పలు (ఫైబర్ బోటు) పై చేపల వేట చేయు మత్స్యకారులకు ఫిషింగ్ లైసెన్స పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమునకు అధ్యక్ష్యత వహిస్తూ జాయింట్ డైరక్షక ఆఫ్ ఫషహిప్ సి. నిర్మలా కుమారి , అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ ఫిషరిస్ షేక్ దిల్షద్, అప్పారావు , ఫిషరీస్ డెవలెప్మెంట్ ఆఫీసర్. ఎస్ .గణేశ్వర్ రావు , టూరిజం డిపాక్స్ మెంట్ నుండి కె. సురేష్ పాల్గొని ఈ క్రింది విషయాలను వివరించడమైనది. జీవో నెం: 1012 ప్రకారము మత్స్యకారులకు గోదావరి నందు చేపల వేట చేసుకొనేటుకు జీవన భృతిని సాగించుకొనటకు నావలకు, తెప్పలకు ప్రతామేట విసురువల, తేలు వల మెదల్పైన వలలకు తనిఖీ చేసి లైసెన్స్ చాలను జారీ చేయబడును. ఈ లైసెన్సలను కేవలం చేపల వేటకు మాత్రమే. ఉపయోగించ వలనే కాని ఇసుక రవాణా చేయు టకు కాని, మనుషులనం బోటు పై షికార్లుకు తీసుకొని వెల్లుటకు కాని, నిషేధిత వస్తువల రవాణాకు కాని మరియు ఏ ఇతర అస్మాఘుక కార్యక్రమాలకు ఫిషింగ్ బోట్లను వినియోగించరాదని ఎవరైనా అతిక్రమిస్తే వారి లైసెన్స్ రద్దు చేసి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొనబడునని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు హెచ్చరించడం జరిగింది.

# 15 లీటర్ల నాటుసారాతో ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండలంలోని వాడపల్లి శివారులో నాటుసారా అమ్ముతున్నారని సమాచారంతో పోలీసులుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుండి 15లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

# 44వ వెటరన్ నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ ఓపెన్‌మీట్‌లో నాగబాబు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ది. 21-04-2025 నుండి 23-04-2025 తేది వరకు 44వ వెటరన్ నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ ఓపెన్ మీట్ చాముండి విహార స్పోర్ట్స్ స్టేడియం మైసూరు కర్ణాటక రాష్ట్రము నందు జరిగిన 44వ నేషనల్ వెటరన్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ మీట్ 2025లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంనకు చెందిన యాతం నాగ బాబు 100 మీటర్స్ (3వ స్థానం) కాంస్య పతకం మరియు 400 మీటర్స్ (3వ స్థానం) కాంస్య పతకం మరియు 800, మీటర్లు (3వ స్థానం) కాంస్య పతకం మొత్తం 3 విభాగాలు నందు పాల్గొని మొత్తం 3 పతకములు సాధించితిరీ యాతం నాగబాబు ప్రస్తుతం కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు జిల్లా మలేరియా విభాగం నందు సబ్‌యూనిట్ అధికారిగా పని చేయుచున్నాను ఈ సందర్భం గా పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మ కాయల చిన్న రాజప్ప మరియు సామర్లకోట పట్టణం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీ విధ్య యాతం నాగబాబు ను అభినందించినారు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకములు సాధించి సామర్లకోట పట్టణంకు మంచి గుర్తింపు తీసుకుని రావాలి అని అభినందించారు.

# “క్వాంటమ్ సైన్స్ &టెక్నాలజీ”పై అవగాహన సదస్సు







**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో యుసిఇకె కంప్యూటర్ సైన్స్&ఇంజనీరింగ్(సిఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో అలూమ్ని ఆడిటోరియం నందు క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూఇటిసిఐ) మరియు నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం)ల సంయుక్త సహకారంతో “క్వాంటమ్ సైన్స్ & టెక్నాలజీ”అనే అంశంపై జెఎన్‌టియుకె అనుబంధ కళాశాలలు,వివిధ రాష్ట్రాలలోని ఇంజనీరింగ్&డిగ్రీకళాశాలల అధ్యాపకులకు రెండురోజుల పాటు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.కె.మధుమూర్తి ముఖ్యఅతిథిగాను, క్యూఇటిసిఐ ఫౌండర్&సిఇఓ రీనా దయాల్ గౌరవ అతిథిగా విచ్చేయగా ఉపకులపతిప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్,యుసిఇకెప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు వేదికనలంకరించారు.సదస్సుకు జెఎన్‌టియుకె ఐక్యూఏసి ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ.ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, యుసిఇకె సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎల్.సుమలత కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.కె.మధుమూర్తి గారు మాట్లాడుతూ అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు,నూతనఆవిష్కరణలకు వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబునాయుడురతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు.అమరావతి కేంద్రంగా ఏర్పాటైన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన అనంతపురం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం,విశాఖపట్నం నగరాలలో ప్రముఖ పరిశ్రమలు స్పోక్స్ హబ్‌కు వ్యవహరిస్తాయన్నారు.క్వాంటమ్ అల్గారిథమ్‌లు,ట్రేడింగ్‌స్ట్రాటజీలు, రిస్క్ అసెస్‌మెంట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్‌ను ఆప్టిమైజ్ చేయడంద్వారా ఆర్థికమార్కెట్లలో గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందన్నారు.వాతావరణ నమూనాలను మెరుగుపర్చడంతో పాటు వాతావరణ మార్పులను బట్టిమెరుగైన ఉపశమన, అనుసరణ వ్యూహాల అభివృద్ధిలో కూడాఇది సహాయపడుతుందన్నారు. క్వాంటమ్‌సైన్స్&టెక్నాలజీతో కమ్యూనికేషన్, గణన, సెన్సింగ్ మరియు అనేక ఇతర రంగాలలో విప్లవాత్మకమైన మార్పులతో భవిష్యత్తును మరింత మెరుగుపరుస్తుందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీకి ప్రాధాన్యతనిచ్చేందుకు ఎన్‌ఈపి 2020కు అనుగుణంగా సాంప్రదాయ డిగ్రీ కోర్సులను కూడా ప్రొఫెషనల్ కోర్సులుగా రూపకల్పన చేసి క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ&ఎంఎల్ పాఠ్యాంశాలు ఉండేలా నూతన పాఠ్య ప్రణాళికను రూపొందిస్తామన్నారు.క్యూఇటిసిఐ ఫౌండర్ & సిఇఓ రీనా దయాల్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా క్వాంటమ్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా వాస్తవ ప్రపంచంలో ముందున్న అవకాశాల గురించి నిపుణులు అవగాహనకల్పించడంతో పాటు తమ అనుభవాలను పంచుకుంటారన్నారు. పరిశోధనను వేగవంతం చేయడానికి మరియు క్వాంటమ్ టెక్నాలజీని స్వీకరించడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పర్చడానికి, పర్యావరణ వ్యవస్థకు మద్ధతుగా క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూఇటిసిఐ) పనిచేస్తుందన్నారు. విద్య, పర్యావరణ వ్యవస్థను ఏకం చేసేందుకు క్యూఇటిసిఐ కృషి చేయడంతో పాటు పాఠ్యాంశాలను రూపొందించడంలో సహకారాన్ని పెంపొందించడం,ఎంఎస్ఎంఈలకుమద్దతునివ్వడం జరుగుతుందన్నారు.మెషిన్‌లెర్నింగ్ ఆల్గోరిథమ్‌లనువేగవంతం చేయడానికి క్వాంటమ్ కంప్యూటింగ్‌ని ఉపయోగించడం మరియు ఆప్టిమైజేషన్ సమస్యలను వేగంగా పరిష్కరించడంద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సామర్థ్యాలను మరింత పెంచవచ్చునన్నారు.ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ కె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతికత కాలంలో క్వాంటమ్ సైన్స్&టెక్నాలజీ రంగం అద్భుతమైన పురోగతిని సాధిస్తుందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధన మరియు అభివృద్ధిలో భారతదేశాన్ని ముందంజలో ఉంచేందుకు గాను నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం) అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఔషధ ఆవిష్కరణ, అంతరిక్ష పరిశోధన, బ్యాంకింగ్ భద్రత, సుస్థిరాభివృద్ధిలకు క్వాంటమ్ సైన్స్ &టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలాగే ఇదిస్కిల్ ఇండియా, సెల్ఫ్-రిలయంట్ ఇండియా, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డిజి) వంటి జాతీయస్థాయి కార్యక్రమాలకు మద్ధతునిస్తుందన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వచ్చే ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు ఏర్పాటయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా లక్షమందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండి క్వాంటమ్ టెక్నాలజీలో జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులకు మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అందించనున్నామన్నారు. అధ్యాపకులు క్వాంటమ్ టెక్నాలజీపై పట్టు సాధించేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

అనంతరం రీసోర్స్‌పర్సన్‌లు డా.జెబివి.రెడ్డి (డిఎస్‌టి) నేషనల్ క్వాంటమ్ మిషన్‌పై, డా.సుందర్ బాలకృష్ణ (ఐఎఫ్ఎస్) క్వాంటమ్ వ్యాలీ ఆఫ్ ఏపి, విజన్, రోడ్‌మ్యాప్, అవకాశాలపై, శంతను శర్మ (క్యూఇటిసిఐ) క్వాంటమ్ ఎడ్యుకేషన్: గ్లోబల్ ట్రెండ్స్ & ఇండియన్ ల్యాండ్‌స్కేప్‌పై, జి.శ్యామ్‌సుందర్ సంతోష్ కుమార్(క్వాంటమ్ & ఏఐ టెక్ ఇన్నోవేషన్), డా.అనిందిత బెనర్జీ(సిడాక్)లుక్వాంటమ్ సైన్స్&టెక్నాలజీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు, జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలలు, పలు రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ & డిగ్రీ కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి కలచివేసింది

## - సుంకర పావని తిరుమల కుమార్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అమాయకులు చనిపోవడం తనను కలిచివేసిందని మాజీ మేయర్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని తిరుమల కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకలు దాడికి పాల్పడటం హేయమైన చర్యగా సుంకర పావని అభివర్ణించారు. కాశ్మీర్ ప్రాంతంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించబోదని సుంకర పావని తెలిపారు. పహల్గాం ఘటనను సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, పహల్గాం ఘటన దురదృష్టకరమని, ఉగ్రమూకల దాడిలో చనిపోయినవారి పవిత్ర ఆత్మకుశాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తు, మృతుల కుటుంబాలకు పావని ప్రగాఢ సంతాపం తెలిపారు.

# మత్స్యకార భరోసా పథకం రెట్టింపు భృతి మా ప్రభుత్వం ఘనత

## - ఎంపీ సానా సతీష్ బాబు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో ప్రజా సంక్షేమ కార్యక్రమముకు నాంది పలికింది గంగపుత్రులకు ప్రతి ఏటా 2 నెలలపాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్య కార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భృతిని రెట్టింపు చేస్తానని ఎన్నికల హామీలలో భాగంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మాటిచ్చారు ఆమాటను నిలబెట్టుకొంటూ రూ.10,000 నుండి 20,000లకు పెంచినభృతినీ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.258.356 కోట్ల రూపాయలను 1,29,178 మంది లబ్ధిదారులకు ఇందులో కాకినాడ జిల్లా లో 4451 బొట్లు, 24762 మంది లబ్ధిదారులకు రూ.49.504 కోట్లు నేడు స్వయంగా డిబిటి ద్వారా అందించారు. ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం పేద మత్సకారులకొరకు చేపట్టిన ఒక మహత్తర కార్యక్రమం అని, వేట నిషేధ కాలంలో దీని ద్వారా మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందుతుందని, ముఖ్యంగా వారి జీవనోపాధిని నిలబెట్టేందుకు ఇది ఉపయోగ పడుతుందని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత అప్పులు వల్ల మన రాష్ట్రం ఎంతో ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు యొక్క మేదోశక్తితో సంపదసృష్టిస్తూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా పూర్తిచేయడం మా ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి నిదర్శనం అని ఎంపీ సానా సతీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# జగన్మోహిని కేశవ స్వామి సన్నిధిలో జడ్జి శోభారాణి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామివారిని శనివారం నందికొట్కూరు ప్రిన్సిపల్ సివిల్ కోర్ట్ జడ్జ్ కే శోభ రాణి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అర్చక బృందం ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం అందించారు.

# బోడసకుర్రులో ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభం

## - ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు, సర్పంచ్ విజయలక్ష్మి



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** బోడసకుర్రు హౌసింగ్ కాలనీలో నూతనంగా 57.19 లక్షలరూపాయలతో నిర్మించినఓవర్ హెడ్ ట్యాంక్‌ను శనివారం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ప్రతి ఇంటింటికీ త్రాగు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టిందని ఎమ్మెల్యే అన్నారు. పలువురు గ్రామ సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావు దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి., టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు చింతా శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబీ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీను, అధికారి జే.వెంకటలక్ష్మి,జేఈస్వామి, అడపా వెంకటేశ్వరరావు, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పచ్చిమల ఏడుకొండలు, రొక్కాల నాగేశ్వరరావు, ఓలేటి పరమేష్, చింతం శ్రీను, కార్యదర్శి ఆదిశంకరం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టాటా సంస్థతో కలిసి పనిచేయడం గర్వకారణం





## – సంసిథ్ ఫౌండర్ & ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** సంసిథ్ ఇంటర్నేషనల్ స్కూల్, దేశ విఖ్యాత టాటా క్లాస్ ఎడ్జ్‌తోకలిసిపనిచేసేందుకు ఒప్పందం కుదిరిందని, అనేక మంది చిన్నారుల భవిష్యత్తుకు బంగారుబాటలు పడనున్నాయని సంసిథ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఫౌండర్, ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎబిసిడి హెూటల్ హాలులో సంసిథ్ ఇంటర్నేషనల్ స్కూలు ఆద్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాథుర్, స్దానిక శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిదులుగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో సంసిథ్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భవిష్యత్తు తరానికి ఉన్నత విద్యావేత్తలుగా చిన్నారులను తీర్చిదిద్దడంలో సంసిథ్ స్కూల్ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఆనందరావు,ఎంపీ హరీష్ బాలయోగిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంసిద్ధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపక ఛైర్మన్‌వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదిహేనుశాఖలుకలిగి,పదిహేను వేలమంది పైగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సంసిథ్ ఇంటర్నేషనల్ స్కూలు టాటా సంస్థతో కలసి పనిచేయడానికి జాతీయ స్థాయిలో ఒప్పందం చేసుకోవడం తమకు గర్వకారణం అన్నారు. సంసిద్ధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరియుటాటా క్లాస్‌ఎడ్జ లిమిటెడ్ ప్రాథమిక విద్యా సహకారాన్ని ప్రకటించాయని తెలియజేసారు. టాటా ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,టాటా క్లాస్ ఎడ్జ లిమిటెడ్ ఛైర్మన్ కే.ఆర్.ఎస్ జంవాల్ మాట్లాడుతూ టాటా క్లాస్ ఎడ్జ యొక్క ఆధునిక అకడమిక్ సొల్యూషన్ మరియు కొత్త అధ్యాపక పద్ధతులను, సంసిద్ధ్ యొక్క విలువ ఆధారిత విద్యా మోడల్‌తో మిళితంచేసి,చిన్నారులను అత్యుత్తమ విద్యార్థులుగా తయారుచేసే లక్ష్యంతో ముందుకు సాగనుందన్నారు. సంసిద్ధ్‌తో కలిసి, స్కూల్స్‌కు డిజిటల్ మార్పు ప్రయాణంలో విశ్వసనీయ భాగస్వామిగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని టాటా క్లాస్ ఎడ్జ లిమిటెడ్ డైరెక్టర్ తరుణ్ భోజ్వానీ పేర్కొన్నారు.

సంసిద్ధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సీఈఓ ఇందు సన్నూ మాట్లాడుతూ విద్య అనేది కేవలం అకడమిక్ ఫలితాలకే పరిమితం కాకుండా, బాధ్యతగల ప్రపంచ పౌరులను అభివృద్ధి చేయడం గురించి అని, టాటా క్లాస్ ఎడ్జ‌తో కలిసి,ఈనమ్మకాన్ని నూతన ఉత్సాహంతో, అత్యుత్తమతతో కొనసాగించేందుకు మేము ముందుకు వస్తున్నామని అన్నారు. సిబిఎస్ఈ సిలబస్‌లో బోధన కేవలం చాక్ అండ్ టాక్ పద్ధతిలో కాకుండా, వ్యక్తిగత శ్రద్ధ మరియు శాస్త్రీయంగా ప్రణాళిక చేయబడిన పద్ధతుల ద్వారా జరుగుతుందని, బోధనా విధానంలో సాంకేతికతను అనుసంధానించి,సమగ్రమైన డిజిటల్ విద్యను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, జంపన సుమన్ వర్మ, పొలమూరి ధర్మపాల్, యెండూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శృంగార వల్లభ స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్బంగా కార్యనిర్యాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,32,590/–, అన్నదాన విరాళాల ద్వారా రూ.58, 073/–లు, కేశఖండన ద్వారా రూ.9,360/–, తులాభారం ద్వారా రూ.700/– లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.22,395/– మొత్తం రూ.3, 23,118/–లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది.

అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మూడు మండలాల్లో పోలవరం గ్రామ సభలు

## – నిర్వహించిన ఐటీడీఏ పీవో అపూర్వ భారత్



**చింతూరు,మేజర్‌న్యూస్ :** పోలవరం ముంపుకు గురి అవుతున్న కూనవరం,వి.ఆర్.పురం,చింతూరు మండలాల్లోని మూడు గ్రామాలైన చొప్పల్లి, వడ్డిగూడెం, మల్లి తోట గ్రామాలకు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భారత్ శనివారం పోలవరం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో అర్హుల మరియు అనర్హుల జాబితాను ప్రజా ప్రతినిధులు, అధికారుల మరియు నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించడం జరిగింది. ఇదే గ్రామసభలలో అనర్హులు మరియు రెండు జాబితాలో పేరులేని వారు ఈ గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి దరఖాస్తులు అందించవచ్చుమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పేర్కొన్నారు. ఈ గ్రామ సభ జరిగిన నాటి నుండి 15 రోజుల వరకు నిర్వాసితులు నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది అని అన్నారు. ఈ సందర్భం గా ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ మాట్లాడుతూ ప్రతి ఒక్క నిర్వాసితుడికి న్యాయం చేయడానికి కృషి చేస్తామని ఈ గ్రామసభ ను ఉద్దేశించి అన్నారు. అదేవిధముగా డ్రాఫ్ట్ అర్&అర్ ప్యాకేజీ ప్రతిపాదనలు పంపడానికి నిర్వాసితుల నుండి ఫిజికల్ డాక్యుమెంట్స్ అవసరం అవుతాయి అని, కాబట్టి అందరూ ఫిజికల్ డాక్యుమెంట్స్ పంచాయతీ వారికి సమర్పించవలసిందిగా కోరినారు. ఈ నాలుగు గ్రామాలలో మొత్తం 2841 మంది పిడిఎఫ్ లో ఉన్నారు అని, వారిలో 2521 మంది అర్హులు మరియు 320 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగినది అని అన్నారు. అనర్హుల నుంచి తీసుకున్న దరఖాస్తు పరిశీలించి వారిని కూడా రెండవ గ్రామ సభ నాటికి అర్హులుగా గుర్తించి వారికి కూడా న్యాయం చేయటం జరుగుతుంది అని అన్నారు.

నిర్వాసితులు ఎవరు కూడా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసోవద్దని ఈ సందర్భంగా సూచించారు. ఇప్పటివరకు28 గ్రామసభలు నిర్వహించడం జరిగినది అని, మిగిలిన 4 గ్రామాల గ్రామసభలుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామని అన్నారు. ఈగ్రామసభల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ మరియు పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రదాడులకు నిరసనగా జనసేన కొవ్వొత్తి ర్యాలీ



ఎటపాక,మేజర్‌న్యూస్ : అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జమ్మూ కాశ్మీర్ పెహల్గం ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు కొవ్వొత్తుల ర్యాలీ శనివారం నిర్వహించడం జరిగింది. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించడం జరిగింది. పాకిస్తాన్‌ఉగ్రవాదాన్ని నశించాలి అనే నినాదాలతో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మోలసతీష్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గామ్‌లో అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడులను అరికట్టాలి,దేశ సమగ్రతను దెబ్బతీయటానికి అమాయక ప్రజలపై ఉగ్రవాదులు దాడి చేయటాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. తీవ్రవాదులు ఏ దేశం వారైనా, ఎక్కడివారైనా, ఎంతటి వారైనా, ఏ మతం వారైనా వెంటనే దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రవాదులకు ఊతమిస్తున్న ఏ దేశం వారైనా సరే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. ఇప్పటికైనా ఉగ్రవాదులు దుశ్చర్యలు ఆపాలని,దేశంలోశాంతినెలకొలపాలని ఆకాంక్షించారు. ఈనిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మోల సతీష్, మంద సుబ్రమణ్యం, గోవింద వెంకట్, గోడేటి నాగరాజు,మండల యూత్ ప్రెసిడెంట్ కొమ్ము వెంకటేష్, సాయికిరణ్, మహేష్, ఈశ్వర్, పింగిలి వెంకన్న,విజయ్,సాయి,రాజేష్,సత్తి పండు, బాలాజీ, సతీష్, ప్రసాదు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భర్త మరణించిన భార్య పించనుకు దరఖాస్తు చేసుకోవాలి

## – ఎంపీడీవో యాదగిరేశ్వరరావు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పింఛను పొందుతూ భర్త మరణిస్తే భార్యకు మార్పు చేసుకొనే అవకాశం ఉందని వెంటనే సంబంధిత సచివాలయంకు వెళ్లి ఆన్ లైన్ చేసుకోవాలని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు తెలిపారు. పింఛను పొందుతూ 2023 సం. డిసెంబర్ ఒకటి తరువాత మరణించిన పింఛన్ దారుడు భార్య ఈ పింఛనుకు అర్జీ చేసుకోవాలని వెల్లడించారు. భర్త పింఛను వివరాలు, ఆధార్, మరణధ్రువపత్రం, దరఖాస్తు చేసుకొనే వారి ఆధార్ వివరాలను సచివాలయంకు వెంట తీసుకొని వెళ్లాలని ఎంపీడీవో వెల్లడించారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 యాక్షన్ ప్లాన్‌పై సమావేశం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్:** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ సమావేశం ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి నియోజకవర్గానికి శాసనసభ్యులు ఛైర్మన్‌గాను, ఆర్డీఓ వైస్‌ఛైర్మన్‌గాను, పెద్దాపురం ఎంపిడిఓ కన్వీనర్‌గాను, మండలస్థాయి అధికారులందరూ మెంబర్లుగా ఒక కమిటి ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీఓ తెలిపారు. దీనికి సంబంధించి నియోజకవర్గ విజన్ ప్లాన్ ఏ విధంగా తయారుచేయాలి అనే విషయంపై అవగాహన కార్యక్రమం అన్ని శాఖల అధికారులతో కలసి యాక్షన్ ప్లాన్ ప్రిపేర్ చేయడానికి ఈసమావేశం నిర్వహిం చారు. కావలసిన సమాచారం ఆర్డీఓ కార్యాలయంకు అందజేయ వలసినదిగా ఆర్డీఓ కె.శ్రీరమణి, సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈసమావేశంలో పెద్దాపురంతహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మీ,ఎంపిడిఓ డి.శ్రీలలిత, సామర్లకోట ఎంపిడిఓ హిమ మహేశ్వరి, ఎడిఎ దైవకుమార్, పి.ఆర్.డి.ఇ.రామకృష్ణయ్య,ఏఓ సంజయ్ కుమార్, వైద్యులు, పశు వైద్యులు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సామర్లకోట, రాజానగరం ఏడిబి రోడ్డు పనులు పరిశీలించిన రోడ్లు భవనాలు శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్



గండేపల్లి, మేజర్ న్యూస్ : గండేపల్లి మండలం సూరంపాలెం శివారు రామేశ్వరం పేట గ్రామం వద్ద సామర్లకోట నుండి రాజానగరం వెళ్లే ఏ డి బి రోడ్డు పనులను పరిశీలించడానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విచ్చేశారు. ముందుగా మంత్రి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆర్ అండ్ బి ఇంజనీర్లు, రోడ్ కాంట్రాక్టర్ బి ఎస్ ఆర్ ఇన్ఫ్రా టెక్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్‌తో కలిసి రోడ్డు పనులు పరిశీలించారు., ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మంత్రి తో మాట్లాడుతూ ఈ సర్కిల్ లో విద్యాసంస్థలు ఎక్కువగా ఉండటంతో హాస్టల్స్, స్టడీ సెంటర్లు ఉన్నాయని వీటన్నిటికీ అనువుగా ఇక్కడ ప్లే ఓవర్ క్లోజ్ బ్రిడ్జి కాకుండా పిల్లర్స్ పై ఏర్పాటు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే నెహ్రూ విన్నవించుకున్నారు.

మంత్రి ఎమ్మెల్యేతో అన్ని రకాలుగా పరిశీలించి దానిపై తగు చర్యలు తీసుకుంటానని మంత్రి అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో మిగిలి ఉన్న రోడ్ల గురించి మంత్రికి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సాను కూలంగా స్పందించి వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తానని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు,పోతుల మోహనరావు, మారి శెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, పాలచర్ల సత్యనారాయణ, ఆర్‌అండ్‌బి ఎస్ఈ జి.కాంత్, ఏఈలు ఎస్‌బివై రెడ్డి, బీరాము, కేరవీంద్ర, జి.శ్రీనివాస్, బిప్రసాద్‌బాబు, టిడిపి నాయకులు కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు, గింజల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పిసిపిఎన్‌డిటి చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలి



కాకినాడ, మేజర్‌న్యూస్ : ఆడశిశు జననాల పట్ల వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు పిసిపిఎన్డిటి చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఇన్ఛార్జి కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు.

శనివారం ఉదయం కలెక్టరేట్ కోర్టు హాలులో పిసిపిఎన్డీటి చట్టం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఇన్ఛార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కడపటి సారి జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను చర్చించి, కొత్తగా ఏర్పాటు చేసేందుకు ఒకటి, రెన్యూవల్ కొరకు ఒకటి అందిన అల్ట్రా సౌండ్ స్కానర్ల ధరఖాస్తులకు కమిటీ ఆమోదం జారీ చేసింది. అలాగే జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానర్లను పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా నిరోధించేందుకు స్కానింగ్ సెంటర్లలో నిర్వహించిన రహస్య డెకాయ్ ఆపరేషన్ల గురించి జేసి సమీక్షించి, వాటికి చేసిన ఖర్చును ఆమోదించారు.

డెకాయి ఆపరేషన్లు నిరంతరం కొనసాగించాలని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిసిపిఎన్డీటి చట్టంలో నిర్దేశించిన నిబంధనలు అన్ని స్కానింగ్ సెంటర్లలో తప్పని సరిగా పాటించేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా. జె.నరసింహ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.రమేష్, డా.పి.సరిత, డా. కె.వి. సుబ్బరాజు, ఏపిపి డి.నాగబాబు, పోలీస్ అధికారి పి.రామ చంద్రరావు, డెమో రాజు, ఎన్జిఓ ప్రతినిధులు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మంలో భజనకెంతో ప్రాముఖ్యత

– అధ్యక్షులు యడవిల్లి సూర్యచక్రం





పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ప్రాచీన కాలం నుండి హిందూ సాంప్రదాయంలో భాగంగా హిందూ ధర్మంలో భజనకు, భజన కళాకారులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, కళలలో భజన కళకు ఒక ప్రత్యేకత ఉండడం ఎంతో సంతోషదాయకమని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శ్రీ విష్ణ్వేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యడవిల్లి సూర్యచక్రం పేర్కొన్నారు. శనివారం పెద్దాపురం మండలం, ఆనూరు కొత్తూరు గ్రామంలో శ్రీ విజయదుర్గ పాదాలమ్మ మహిళా భజన సమాజం, శ్రీ కోదండ నూకాలమ్మ భజన సమాజం (మర్రిపూడి) లు శ్రీ విష్ణ్వేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘంలో సభ్యత్వాలు తీసుకున్న సందర్భంగా ఆయన విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో కూడా భజన పట్ల ప్రజలు చూపిస్తున్న ఆదరణ మరువలేనిదని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సంఘాన్ని ఎంతో బలోపేతం చేయడం జరుగుతుందని, దానికి అందరి సహకారం ఉండాలని ఆయన కోరారు. అలాగే గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి మాట్లాడుతూ గతంలో భజన కళాకారులు పురుషులే ఉండేవారని, ఇప్పుడు మహిళలు కూడా చొరవతో ముందుకు వచ్చి భజన గీతాలు నేర్చుకుని ఆలపించడంతో ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కవి శేఖర నీలం శ్రీను, బళ్ళ నాగభూషణం, బళ్ళ ప్రభాకరరావు, మరియు భజన కళాకారులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు బహుమతులు అందజేత



అమలాపురం,మేజర్‌న్యూస్ : అమలాపురం మండలం, పాలగుమ్మిలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పాఠశాల పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 500 మార్కులకన్నా ఎక్కువ సాధించిన 11మంది విద్యార్థినీవిద్యార్థులకు అమలాపురంకు చెందిన దస్తావేజు లేఖరి మట్టపర్తి రాము బహుమతులు అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాము కుమార్తె మట్టపర్తి లక్ష్మీ కార్తీక సౌందర్య ఆర్థిక సౌజన్యంతో స్కూల్ ఫస్ట్, సెకండ్ సాధించిన విద్యార్థులకు శాలువా మరియు స్వీట్ బాక్స్‌తోపాటు రోల్డెక్స్ ఫైల్, చేతి గడియారం, డిక్షనరీలను విద్యార్థులకు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్, యాజమాన్యం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుప్రమాదంలో ఉపాధి కూలీలకు గాయాలు

కొత్తపేట, మేజర్ న్యూస్ : రోడ్డుప్రమాదంలో ఉపాధి పని కూలీలకు గాయాలైనట్లు కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర తెలిపారు.వివరాల్లోకి వెళ్తే మండలంలోని అవిడి గ్రామ శివారు చప్పిడి వారి పాలెం కు చెందిన మహిళలు ఉపాధి పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతి వేగంతో వచ్చి ఢీకొంది.ఈ ప్రమా దంలో తొమ్మిది మంది గుబ్బల నాగలక్ష్మి,మట్టపర్తి నాగలక్ష్మి,చప్పిడి గన్నెమ్మ,గుబ్బల లక్ష్మీ,జక్కంపూడి పెంటమ్మా,కూడిపూడి నాగమణి, ఇళ్ల వెంకటలక్ష్మి,పితాని సత్యవతి,చప్పిడి గౌరీలక్ష్మి అనే మహిళలకు గాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వీరిలో కొంతమందిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.దీనిపై బాధితరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పిఠాపురంలో పోలీసుల విస్తృత తనిఖీలు



పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో... పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పహల్ గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి దృష్ట్యా... ఏపీ డీజీపీ మరియు కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వారి ఉత్తర్వులు మేర కు ఉగ్రవాదుల మరియు సంఘ విద్రోహ నివారణ చర్యల్లో బాగం గా... ఇతనిఖీలు చేపట్టినట్టు సిఐ శ్రీనివాస్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

పిఠాపురం సర్కిల్ ముఖ్య కూడళ్లలో సాయంత్రం 4 గంటలు నుండి 6 గంటలు మధ్య వాహన తనిఖీలు చేపట్టారు. లాడ్జిలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పిఠాపురం పట్టణ ఎస్సై వి.మణికుమార్, అదనపు ఎస్ఐ షేక్ జానీ బాషా, కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్, గొల్లప్రోలు ఎస్సై ఎన్ రామకృష్ణ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రసాయనాయలతో పండ్లను మాగ బెట్టి విక్రయిస్తే వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం

– జిల్లా జాయింట్ కలెక్టర్,ఎస్.చిన్న రాముడు



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రసాయనాలతో పండ్లను మాగ బెట్టి విక్రయిస్తే అటువంటి వారిపై, వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాజాయింట్ కలెక్టర్,ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు.స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో రైతులు, వినియోగదారులు, వ్యాపారస్తులతో కృత్రిమంగా పండ్లను మాగ బెట్టడం ఆరోగ్యానికి హానికరమనే అంశంపై శనివారం ఉదయం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూసహజ సిద్ధంగా పండ్లను మాగ పెడితే ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి హాని కలుగదని పేర్కొన్నారు.ఆకోణంలో వ్యాపారస్తులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరమని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రజలు సహజంగా పండిన పండ్లను ఎంచుకోవాలని, రసాయనాలతో మాగ బెట్టిన పండ్ల ను తినడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టడం చాలా సాధారణమని ఈ పద్ధతి వల్ల పండ్లలో హానికరమైన రసాయనాలు చేరి, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర మైన ప్రభావం చూపిస్తున్నా యన్నారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో మాగ బెట్టిన పండ్లను తింటే,గుండెజబ్బులు,శ్వాసకోశవ్యాధులు, జీర్ణవ్యధులు, మరి యు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని తెలిపారు.పండ్లు మాగ పెట్టిన వ్యాపారస్తులపై ఆరు నెలలుజైలు,5లక్షల రూపాయలు వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.అటువంటి వాటిని గుర్తిస్తే అధికారులకి ఫిర్యాదు చెయ్యాలని జేసి కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రత అధికారి వి. రుక్కయ్య మాట్లాడుతూ వ్యాపారస్తులు నిషేధిత కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పళ్ళను మాగ బెట్టితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రసాయనాలతో వ్యాపారస్తులు పండ్లను మాగ పెడితే వారి లైసెన్సులు పూర్తిగా రద్దు చేస్తామన్నారు.మామిడి పండ్లు,ఇతరపండ్లు కృత్రిమం గా మాగబెట్టే పద్ధతులు ప్రజల ఆరోగ్యానికి చాలా హానికరమన్నారు.కావున ఎథలిన్ గ్యాస్ ఛాంబర్లు, రైఫిన్ ప్యాకెట్లు, గడ్డిలో గాని,ద్వారానే పళ్ళు మాగ పెట్టాలని తెలిపారు.ఈవిధంగా పండ్లనుమాగపెడితే ప్రజల ఆరోగ్యాలను కాపాడడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ఏడిమార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సునీల్ వినయ్, జిల్లా ఆహార భద్రత అధికారి వి. రుక్కయ్య, జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.సుజాత కుమారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బివిసి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ



**అల్లవరం,మేజర్‌న్యూస్ : ఓడలరేవు** స్థానిక బీవిసి ఇంజనీరింగ్ కళాశాలలో ఈరోజు కళాశాలలోని సైన్స్ అండ్ హ్యుమానిటీస్ మరియు ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించబడినది.ఈ కార్యక్రమంలో వాటర్ ప్యూరిఫికేషన్ హైడ్రో పవర్ ప్లాంట్, పొటాటో కెనాల్, ఎలక్ట్రిసిటీ జనరేటర్,లావా ల్యాండ్ స్కై హైట్స్ రెయిన్ అలారం, బజర్ గేమ్,వాటర్ డిస్టిలేషన్ కాంక్రీట్ మిక్సర్ వంటి పలు రకాల సైన్స్ మోడల్స్ ప్రదర్శించబడ్డాయి.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహేశ్వర దత్త మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలోని సృజనాత్మకతను ప్రతిభను గుర్తించడానికి ఉపయోగపడతాయి అని వివరించారు. మొదటి బహుమతిని ఎస్.ఎస్.వి.సుశితఅండ్‌టీమ్,రెండవబహుమతిని వి.శరణ్య అండ్ టీమ్, మూడవ బహుమతిని డి.మోక్ష వినాయక్ అండ్ టీమ్ గెలుచుకున్నారు ఈ కార్యక్రమంలో బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్మెన్ బోనం కృష్ణ సతీష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆకుల ప్రవీణ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ.దుర్గా మాధురిపాల్గొని విద్యార్థులను నిర్వాహకులను అభినందించారు. ఐఐసీ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ.రామకృష్ణ, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వై.వి.రమణ మూర్తి మరియు ప్రొఫెసర్ జి.లోవరాజు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

# దేశవ్యాప్త కార్మిక సమ్మె విజయవంతం చేయాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మే డే స్ఫూర్తితో మే 20వ తేదీన దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. మే 1న ప్రపంచ కార్మికవర్గ మే డే పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున కార్మికులు మేడే జెండాను ఎగర వెయ్యాలని, ఈ స్ఫూర్తితో మోడీ సర్కార్ కార్మిక రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె, బందును విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక హక్కులను కేంద్రం మోడీ సర్కార్ కాలరాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయాలని చూస్తున్న కార్మికులకు నష్టం కలిగించే అటువంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల పట్ల ఎంతో దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయడం వలన కార్మికులకు ఎంతో నష్టం జరుగుతుందని, దానితోపాటు కార్మికులు హక్కుల కోసం పోరాడే స్వతంత్రతను కోల్పోతారన్నారు. కార్మికుల హక్కులను తుంగలో తొక్కి ప్రశ్నించే హక్కు లేకుండా చేసి కార్మికుల శ్రమను దోచుకుని కట్టు బానిసలుగా చేసి కార్పొరేట్ శక్తులను ఇంకా సంపన్నులుగా చెయ్యాలన్నదే మోడీ సర్కార్ లక్ష్యం అని విమర్శించారు. కార్మిక లేబర్




కోడ్లను రద్దు చేయడం కోసం అన్ని రంగాల కార్మికులు అంగన్వాడీ, ఆశా వర్కర్స్, వెలుగు యానిమేటర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు మరియు స్కూలు శానిటేషన్ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు, వీఆర్ఏలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్, ప్రకృతి వ్యవసాయ కార్మికులు, పంచాయతీ కార్మికులు అలాగే ఇతర యూనియన్ కార్మికులు, రైతులు పెద్దఎత్తున భాగస్వాములు అయి పోరాడాలని యావత్తు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐయు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె శాంతి రాజు, జిల్లా సహాయ కార్యదర్శి బి,నిర్మల, జిల్లా కమిటీ సభ్యులు కె రాణి, కె రామలక్ష్మి, కె వెంకటలక్ష్మి, రాజేశ్వరి, జి బేబీరాణి, టి.శ్రీను పాల్గొన్నారు.

# చార్మినార్ వర్మకు "చేయూత" ప్లాటినం సభ్యత్వం



**కాకినాడ,మేజర్‌న్యూస్:** సామాజిక సేవ కార్యక్రమాలతో అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్న చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ప్లాటినం సభ్యత్వాన్ని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సీనియర్ సభ్యులు చార్మినార్ వర్మకు చేయూత వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.రవికుమార్ అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ అసోసియేషన్‌లో కీలకబాధ్యతలు నిర్వహిస్తూ రోటరీ గోల్డెన్ జూబ్లీ ద్వారా అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడమే కాక చేయూత వంటి సమస్తకు "బ్యాక్‌బోన్" లా వర్మ ఉన్నారని అటువంటి వ్యక్తికి ప్లాటినం సభ్యత్వం అందజేయడం గర్విస్తున్నామన్నారు. రోటరీ చేయూత భవన్ ఆవిర్భాంలో ఒకరిగా ఉన్న చార్మినార్ వర్మ నిరంతరం సేవా కార్యక్రమాలలో నిమగ్నమై ఉంటారని, అటువంటి వ్యక్తి సారథ్యంలో చేయూత మరింతగా అభివృద్ధి చెబుతుందన్నారు. చేయూత వార్షికోత్సవంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి చేతుల మీదుగా చార్మినార్ వర్మను సత్కరించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. విద్యా, వైద్య, క్రీడలు మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేయూత సంస్థ అంకితమై పనిచేస్తుంది అని చెప్పారు. చార్మినార్ వర్మ మాట్లాడుతూ చేయూత సంస్థ కాకినాడతోపాటు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర నిత్య అన్నదాన పథకాన్ని నిర్వహిస్తూ రోగులకు, గర్భిణీలకు వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందజేయడం గొప్ప సేవగా కొరియాడారు. జిల్లా యంత్రాంగంతోపాటు ప్రజాప్రతినిధులు కూడా చేయూత సేవాకార్యక్రమాలు ప్రశంసించడం అభినందనీయమని వారంతా ప్రత్యక్షంగా కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకవారి సహాయ సహకారాలు కూడా అందిస్తామని ప్రకటించడం చేయూత సంస్థ అంకితభావానికి నిదర్శనం అని అభినందించారు. కార్యక్రమంలో తొలుత కార్యదర్శి అలీమ్ అహ్మద్ స్వాగతం పలికారు.

# మెప్మా ఆధ్వర్యంలో... మెప్మా బజార్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా సి ఎం ఎం కే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో... స్థానిక మెప్మా కార్యాలయం వద్ద మెప్మా అర్బన్ మార్కెట్ (మెప్మా బజార్ )ను నిర్వహించారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రతి నెల ఈ మెప్మా బజార్ జరుగుతుందని, ఈ మెప్మా అర్బన్ మార్కెట్ నందు మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, సబ్బులు, పెనాయిల్ బాటిల్స్,సెంట్లు, బ్లౌజులు, కాటన్ చీరలు, నైటీలు, కుట్టిన లంగాలు, గాజులు, వన్ గ్రామ్ గోల్డ్ వస్తువులు, మసాలా పొడి ప్యాకెట్లు, డెకరేటివ్ ఐటమ్స్ తదితర ఉత్పత్తులను వస్త్ర, ఆభరణ, ఆహా, కథ వంటి స్టాల్స్ గా ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు విక్రయించడం మరియు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఎడిఎమ్ శైలజ, ఎమ్ డి ఉమ్మే సల్మా, సిహెచ్ శ్రీవల్లి, టిఎల్ ఎఫ్ ఓబిలు, ఆర్పీలు, ఎస్ ఎల్ ఎఫ్ ఆర్పీ లు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడి పిల్లలకు చెప్పులు పంపిణీ



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఖండవల్లి గ్రామపంచాయతీ సెక్రటరీగా పనిచేయుచున్న చక్రవర్తి తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 26వ తేదీ శని వారం ఖండవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 12 అంగన్వాడీ సెంటర్లలో చదువుకునే పిల్లలకు చెప్పులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో సిహెచ్ వెంకటరమణ, పంచాయతీ సెక్రెటరీ చక్రవర్తి, అంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు.